# నెట్‌లో నానమ్మ !

నేనంటే ఇంటిల్లిపారికీ కొండంత గౌరవం ! అంతకుమించి భయం ! నన్నెదిరించి నామాట జవదాటే ధైర్యం ఎవరికీ లేదు.

నా ఆస్తి వందకోట్లు ! మా శ్రీవారు యాభైయ్యేళ్లనాడే పెద్ద ఇండస్ట్రియలిస్ట్ ! వారసత్వపు ఆస్తి నిల్ ! కేవలం స్వశక్తితో స్వయంకృషితో చిన్న సైజు బిజినెస్ స్టార్ట్ చేసి వైకుంఠపాళీలో అన్నీ నిచ్చెనలే ఎక్కినట్టు పదేళ్ళు తిరిగేసరికి వ్యాపారం ఇండియా అంతా విస్తరించింది. నెలకు పదిసార్లు ఫ్లైట్స్‌లో విదేశయానాలు చేసి అక్కడా బ్రాంచెస్ ఓపెన్ చేయగల సామర్థ్యాన్ని పుంజుకున్నారాయన!

అనతికాలంలో ఆకాశమంత ఎత్తుకెదిగిన బిజినెస్ ఇంటర్నేషనల్ లెవెల్ కెదిగి కోట్లలో టర్నోవర్ పుంజుకుంది.

పబ్లిక్ లిమిటెడ్ కంపెనీ చేయమని ఎందరు ఎన్నిరకాలుగ వత్తిడి చేసినా శ్రీవారు ససేమిరా అన్నారు. తన మీద తనకు అంత విశ్వాసం ! ఆయన సంకల్పబలం గొప్పది !

ముగ్గురు కొడుకులు చేతికి అంది వచ్చాక వ్యాపారాన్ని చూచుకోకపోతారానే నమ్మకం ఆయనది.

అలాంటి వారు... అకస్మాత్తుగ దుర్మరణం పాలై కుటుంబాన్ని విచార సాగరంలో ముంచేశారు. ఆయన సహధర్మచారిణి అయిన నేను నా పెళ్లి నాటికే ఆరోజుల్లో ఎం.బి.ఏ. చేసి వుండటాన మా కంపెనీకి ఛైర్మన్ అండ్ ఎం.డి.గా నేనే వ్యవహరించాల్సి వచ్చింది.

నా భర్త ఆశయ సిద్ధికి పాటుపడుతూ అహర్నిషలు శ్రమించాల్సి వచ్చింది. కొడుకులు ముగ్గిరూ చెట్టంత ఎదిగినా... చదువుల్లో ఎక్కిరాకపోవటం... వ్యాపారాన్ని చూచుకోగల తెలివితేటలు శ్రద్ధ లేకపోవటంతో వాళ్లేదో చిన్న వుద్యోగాల్లో సెటిలైనారు.

ఇంట్లో అడుగుపెట్టిన కోడళ్లు కూడా తెలివితేటల్లో అంతంతమాత్రమే ! వాళ్లకి డబ్బు మీదే ఆశ !. విలాసవంతమైన జీవితం గడపాలనేదే కోడళ్ల కోరిక !.

నా ఒక్కగానొక్క మనుమడు అమెరికాలో పేరున్న డాక్టర్. వారానికి రెండుమూడు

సార్లయినా వాడితో నెట్లో ఛాటింగ్ చేయనిదే తృప్తిగా వుండదు.

వాడే నా ఆశాదీపం !

'ఏరా భడవా !... ఏం చేస్తున్నావ్‌రా...' నెట్ ఓపెన్ చేసి సంభాషణ ప్రారంభించాను.

'నువ్వెలా వున్నావ్ నానమ్మా?-' మనోజ్ ఎదురు ప్రశ్న

'ఇదిగో చూస్తున్నావుగా... ఎనభయ్యో పడిలో కూడా గుండ్రాయిలా వున్నాను...'

'నానమ్మా ! నువ్వు ఒక్కదానివే లంకంత ఇంట్లో ఏం చేస్తావ్? నేకెలా పొద్దుపోతుంది. ఇక్కడకొచ్చి నాతో వుండిపోకూడదూ?...'

'ఒరే డాక్టరూ !... నీవద్దే వుండిపోవటానికి నాకేరోగమూ లేదు. వంట్లో శక్తి వుడిగి నాపని నేను చేసుకోలేనప్పుడు తప్పకుండా వస్తాలేరా అబ్బీ...'

'నీకా అవసరం రాదులే ! డబుల్ సెంచురీ కొట్టేస్తావ్... గిన్నీస్‌బుక్కులోకెక్కేస్తావ్....'

'యువార్ రైట్... డౌటే లేదు. అది సరే... నీ వైఫ్ డెలివరీ అయిందా...? - '

'ఇద్దరు కవలలు నానమ్మా ! ఇద్దరూ ఆడపిల్లలే... అంతా నీ పోలికే... పిల్లలిద్దరూ హెల్దీగ రుబ్బు రోళ్లులా వున్నారు.

'ఛ వెధవ ! తండ్రివైయుండి అట్లా మాట్లాడతగునా?- నీ దిష్టే తగిలేను పిల్లలకు-జాగ్రత్త...'

'డాక్టర్నైన నాకే జాగర్తల గురించి చెప్తావుటే నానమ్మా...'

'చూడూ మూడో నెలొచ్చాక మీరంతా ఓమారు ఇక్కడికి రండి ! ఓ నెల్లాళ్లు వుండిపోదురుగాని... ఏం? చెప్పేది విన్పిస్తోందా ! - వస్తారుకదూ? - '

'వామ్మో ! నెలాళ్లే ! వారం మించి నాకు సెలవు దొరకదే బామ్మా ! నేను చీఫ్ సర్జన్ కదా... ప్రతిరోజూ కేసులమీద కేసులతో బిజీగా వుంటుంది. కాస్తయినా రెస్ట్ దొరకదు.'

'నెట్లో మాట్లాడుకుంటూనే వున్నాం కదే బామ్మా... అద్సరే... నేనిక్కడ స్వంతగ హాస్పిటల్ కట్టించాలనుకుంటున్నాను బామ్మా... అఫ్‌కోర్స్ నావద్ద కొంత కాపిటల్ ఉందనుకో... నువ్వో పదికోట్లిచ్చి పుణ్యం కట్టుకో...'

'అదేదో సినీమాలో అన్నట్టు... ఆవక్కటీ అడక్కు ! డబ్బైతే కావాలిగాని... నన్ను చూచిపోవడానికి మాత్రం రావు. ఎప్పుడూ ఏదోవంక... పోరా వెధవ !...'

'నా వృత్తే అలాంటిది ! నా తప్పేం లేదు. నువ్వు నిష్ఠూరంగ మాట్లాడకే...'

'నువ్వే కాదురా... నా కొడుకులు... కోడళ్లు... అంతా డబ్బు మనుషులు ! అప్యాయతానురాగాలు లేని వాళ్లురా మీరంతా... మోస్ట్ సెల్ఫిష్క పీపుల్...'

'శాపనార్థాలు పెట్టకే.. నా అవసరం అలాంటిది ! నువ్వు కాదంటే... నాకు దిక్కెవరు చెప్పు? - '

'ఈ నంగనాచి మాటలకేంలే? కేవలం నా డబ్బు కోసమే అయితే నాతో మాట్లాడకు..'

'కోప్పడకే బామ్మా ! నువ్వు మంచిదానివి !... నువ్వు బంగారుకొండవి...'

'ఈ కాకా మాటలకేంలే ? - మాటల్తో బోల్తా కొట్టించేస్తావ్...'

'వీలుచూచుకుని మనీట్రాన్స్ఫర్ చెయ్ ! ఇక్కడ వర్క్ సగంలో ఆగిపోయింది. నావద్ద గల డాలర్స్ అన్నీ ఖర్చైనయ్ ! ఇక నీవే దిక్కు... నే టచ్లో వుంటాలే... నేను తప్ప నీకెవరున్నారనీ?. నాకు తప్ప నీ దగ్గరున్న కోట్లు ఎవరికిస్తావ్ ఆలోచించు... బై... వుంటాను...' నెట్ డిస్కనక్టయింది.

పెళ్లి విషయంలో తన ప్రమేయం లేకుండా... తనతో చెప్పకుండా అమెరికన్ గరల్ని లవ్వాడి పెళ్లిచేసున్నాడు గానీ... ఇప్పుడు డబ్బు కోసం మాత్రం తాను కావలసొచ్చింది. పెళ్ళాంతో మాట్లాడనీయకుండా నెట్లో ఆ దొరసాని ఫొటోవుంచి చూపాడు. ఏం బాగుందా పిల్ల? - వాడికెలా నచ్చి... పెళ్లి చేసుకున్నాడో ఆ దేవుడికే అర్థం కావాలి ! అందుకే అంటారు తావలచింది... మునిగింది గంగ అని.

సాంప్రదాయ కుటుంబంలో పిల్లని చూచి పెళ్లాడరా అంటే నా మాట విన్నాడు కాదు. చివరికి ఆ కోతి అదే అమెరికాపిల్ల వాడి నెత్తి గొరిగితే చమ్మగ వుందా వెధవకు !

వీడి ముఖం తగలెయ్య ! వీడెప్పుడూ ఇంతే ! ఎవరి మాటా వినడు ! ఎంత చెప్పినా చెవినేసుకోడు ! స్వీట్గ మాటలు మాట్లాడి ఎదుటివారిని బుట్టలో వేసుకుంటాడు. మాటల్తో బోల్తా కొట్టిస్తాడు.

ఏది నేమైనా... వాడెలాంటి వాడైనా... తన వంశాన్ని వుద్ధరించాల్సింది వీడే కదా? - వీడేం వుద్ధరిస్తాడు. ఇద్దరూ ఆడపిల్లలే ! ఒక మగనలుసైనా పుట్టుకొస్తాడో లేదో వాడికి. ఇద్దరు చాలనుకుంటే... వంశం... నిర్వంశమైపోవటం ఖాయం. తర్వాత తరానికి

తద్దినాలు పెట్టేవారు కూడా లేకుండా పోతారు.

దీనంతటికీ కారణం తన ముగ్గురు కొడుకులు కాదూ?- ఆయన బ్రతికి వుండగానే ముగ్గురు కొడుకులకూ పెళ్లిళ్లు చేశాం ! కానీ ఏంలాభం? పెద్దకోడలికి పిల్లలే పుట్టరని డాక్టర్లు తేల్చి చెప్పేశారు ముఖంమీదే ! అదేమంటే గర్భసంచీ పెరగలేదు. రెండో కోడలు మహాతల్లికి మూడు కాన్పులయినా ఒక్కరూ బ్రతికి బట్టకట్టలేదు. పురిట్లో ఒకరుపోతే... పదోరోజున రెండో బిడ్డ... నెల్లాళ్లయినా బతక్కుండా మూడో సంతానం 'హరీ' అనటం దౌర్భాగ్యం. ఇకపై పిల్లలు పుడితే తల్లికే ప్రమాదమని పుట్టకుండా ఆపరేషన్ చేసి మా ఆశలమీద నీళ్ళు చల్లారు. మూడో కోడలు రాక్షసి ! తన మొగుడికి ఆస్తిలో వాటా ఇస్తే గాని మొగుడితో కాపురం చేసేది లేదని భీష్మించుకుంది. కొడుకేమో పెళ్లాం కొంగు పట్టుకు తిరిగే ఆడంగి వెధవ!-

ఇలాంటి కుంకలు ముగ్గరూ నా కడుపున ఎలా పుట్టారానేదే నా దిగులు ! ముగ్గురుకీ అలవాట్లకేం తక్కువ లేదు. ఇంట్లోనే ఓ గదిలో 'బార్' ఓపెన్ చేశారు. తీరిక దొరికినప్పుడల్లా తాగటం బెడ్‌రూం తలుపులు బిడాయించుకోవటం. ఇదీ వాళ్ల తీరు.

ఆస్తిలో తమవాటా తమకిచ్చేయమంటూ ముగ్గురూ రోజూ తండ్రితో తగాదా ! ఆయన కొడుకులను లెఖచెయ్యకపోగా... ఆస్తి అంతా తన స్వార్జితమంటూ కేకలు ! వాళ్లు రెచ్చిపోవటం.

కొంపలో నానా రభస !

ఒకరోజు రాత్రి ఆయన నిద్రపోతూండగ ముగ్గురూ బెడ్‌రూమ్‌లోకి ప్రవేశించి కర్చీఫ్‌కి 'క్లోరోఫారమ్' అద్ది దానితో తండ్రి ముక్కు దగ్గరుంచి స్పృహ కోల్పోయాక ముగ్గురూ ఏకమై తండ్రి గొంతునులిమి చంపి... తమకేమీ తెలియనట్టు ఎవరి బెడ్‌రూమ్స్‌లోకి వాళ్లు వెళ్లిపోయారు.

ఆస్తి కోసం కడుపున బిడ్డలే కన్న తండ్రిక పీక పిసికి చంపే దృశ్యాన చీకటివెలుగులో కిటికీ అద్దాల్లోంచి చూచి కళ్లు తిరిగి పడిపోయాను. ఎంతటి దుర్మార్గం?... కాదు రాక్షసత్వం?... వీళ్లు కొకుకులా... కన్న బాడ్డలా?...

తెల్లవారకముందే మెలకువ రావటంతో ఆయన గదిలోకి వెళ్లి నా భర్త మృత దేహం మీద వాలిపోయి వలవలా ఏడ్చాను. గుండెలు అలిసేలా రోదించాను.

ఏమీ ఎరగనట్టే కొడుకులు ముగ్గురూ తండ్రి శవం పక్కన దోషుల్లా నిల్చుండిపోయారు. తండ్రిని తాము హత్యచేయటం తల్లి చూచిందా?... ఉరిశిక్ష పడేట్టు చూస్తుందేమోనే అనుమానం వారిలో అంకురించటంతో... తల్లి ముఖంలోకి నూటిగ చూడటం గాని... ఆమెను ఓదార్చటంగాని చేయుటానికి సాహసించలేకపోయారు.

కానీ... తల్లి చూసే వాడి చూపులు కొడుకుల గుండెల్లో శూలాల్లా దిగపెడుతనే వున్నయ్!

ఆలస్యం చేస్తే తల్లి... తన భర్త అకాలమరణాన్ని భరించలేక హాస్పిటల్‌కు తండ్రి శవాన్ని తరలించి పోస్ట్‌మార్టం చేయిస్తుందేమో? - తండ్రి కుత్తుకపై వారి వేలిముద్రలుండటం పోలీసులు నిర్ధారించటం జరిగితే... ముగ్గురికీ ఉరిశిక్ష తప్పదు.

కానీ కడుపున పుట్టిన దౌర్భాగ్యానికి నేను కన్న బిడ్డలే తండ్రిని చంపిన హంతకులని నిరూపణ చేయటానికి అందుకు తగిన చర్యలు తీసుకోవటానికి మనస్కరించలేదు. కొడుకలా వీళ్ళు? నరరూప రాక్షసులు ! ఎంతటి అమర్యాద? లోకులకీ విషయం తెలిస్తే ముఖాన వుమ్మారూ? - అందుకే తన ఆవేశాన్ని... ఆవేదనను.. కోపాన్ని... అసహ్యాన్ని మనసులోనే అణుచుకోలేక తప్పలేదు.

ఆ రాత్రి కాళరాత్రి తవుతుందని వూహించలేకపోయాను. మందు మత్తులో ఉచ్ఛనీచాలు మరిచి ప్రవర్తించి తండ్రిని పొట్టన పెట్టుకున్నారు.

శవదహన కార్యక్రమం ముగిశాక నా కంటికి కన్పించకుండా కొడుకులు ముగ్గురూ తమ భార్యలతో ఎటో వెళ్లిపోయారు.

వాళ్లు ఎక్కడికెళ్లిందీ తెల్సుకోవాలన్పించలేదు. భర్త మరణానికి గల అసలు కారణం నలుగురికీ తెలియకూడదని రహస్యంగ మనసులోనే నిక్షిప్తం చేసి యాక్సిడెంట్లో చనిపోయారని అబద్ధపు 'ఎలిబీ' సృష్టించాల్సి వచ్చినందుకు నాలోనేను కుమిలిపోయాను.

కొన్నాళ్లు గడిచాక వ్యాపారాన్ని వదులుకుని ఇంటికే పరిమితమైనాను. కొడుకులెలాగూ తనను కాదనుకుని వెళ్లిపోయారు. తిరిగి రారన్పించింది.

మరిది ఆర్థికపరమైన నష్టాల్లో వున్నాడని తెల్సి అతని ఆఖరి మగపిల్ల వాడిని పెంచుకోవాలని తెచ్చుకుని నాతోవుంచుకున్నాను. పిల్లవాడిని అయిదేళ్ల వయసులో

నాకు అప్పగించి నా సొంతం చేసినందుకు అతని ఆర్థిక దుస్థితి చూచి ఓ పాతిక లక్షలిచ్చి... ఇక ఇచ్చిన పిల్లవాడి గురించి మరచిపొమ్మన్నాను.

ఎనిమిదో ఏట వాడికి ఉపనయనం జరిపించాను. నన్ను నాయనమ్మ అనే పిలవటం వాడికి అలవాటు చేశాను.

మనోజ్ చురుకైనవాడు. చదువులో నెంబర్‌వన్ ర్యాంకు హెూల్డరవటం చూస్తూ ఎంతో ముచ్చటపడి మురిసిపోతూ వచ్చాను. వాడి అభిరుచి మేరకే మెడిసిన్ చదివించి ఎం.ఎస్. అయ్యాక అమెరికా వెడతానంటే కాదన్లేకపోయాను.

వీడూ ఆ తానులో ముక్కే కదా? ఆ ఇంటి పేరిటవాడే ! వీడిదీ ఆ గోత్రమే కదా?.. కాకపోతే నా కొడుకుల్లా వీడు దుర్మార్గుడు కాదు. తెలివి తేటలతో చదుకుని డాక్టరై అమెరికా వెళ్ళి పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నాడు.

మనుమడు అడిగినంత డబ్బు వాడికిస్తే వాడి దృష్టిలో నానమ్మ దేవత ! లేకపోతే దయ్యం ! అమెరికా వెళ్లాక తనను చూడటానికి ఒక్క సారైనా రాకపోయినా పదికోట్లకు ఇండెంటు పెట్టాడు.

అప్పటికి ఇప్పటికీ నా ముగ్గురి కొడుకలూ ఏమైనారో తెలీకుండా పోయింది. నాకు మిగిలిందల్లా మనమడు మనోజ్ వక్కడే ! వీడి వల్లనైనా నా వంశం వృద్ధి చెందుతుందని కన్నకలలు కల్లలైనయ్ - వీడికి ఇద్దరూ ఆడప్లిలే ! ఇక చాలనుకుంటే.. వంశం అంతరించిపోతుంది. తద్దినాలు పెట్టేవారే వుండరు.

'నువ్వడిగినంత డబ్బు నీ అకౌంట్‌కి ట్రాన్స్‌ఫర్ చేశారా అబ్బీ ! నీ హాస్పిటల్ ప్రారంభోత్సవానికి నేనొస్తాలే... బీహేపీ...' అనగానే మ్యాసివ్ హార్ట్ ఎటాక్‌తో కుప్పకూలి పోయా తుదిశ్వాస వదిలే దృశ్యాన్ని మనుమడు డా॥ మనోజ్ చూచి దిగ్భ్రాంతికి లోనైనాడు.

--- సమాప్తం ---